నేటి దినపత్రిక
సూర్య
18వ
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం,27 మార్చి 2025



## ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రాణాలను కాపాడుకోండి

### -ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూగారు జగ్గంపేట నియోజక వర్గంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్ పై ప్రయాణం చేయరాదని, రోడ్డు దాటేటప్పుడు కంపల్సరీ వాహనాలను చూచుకుని దాటాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ముఖ్యంగా హైవేపై వాహనాలు నిలుపుదల చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని,అతివేగంగా ప్రయాణం చేయవద్దని మీప్రాణాలు కాపాడుకుని మీకుటుంబంతో సంతోషంగా జీవించాలని ఆయన తెలియజేశారు.

### నిడదవోలు ఎర్రకాలువ ముంపు వల్ల నష్టపోయిన రైతాంగానికి

# ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు లైన్ క్లియర్

- కలెక్టర్ల సదస్సులో ఆర్థికశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సీఎం
- త్వరలోనే సంబంధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంత్రి కందుల దుర్గేష్
- సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** నిడదవోలు ఎర్రకాలువ ముంపు వల్ల నష్టపోయిన రైతాంగానికి ఇన్ ఫుట్ సబ్సిడీ విడుదలకు లైన్ క్లియర్ అయిందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం వెలగపూడి సెక్రటేరియట్ 5వ బ్లాక్ లో రెండవ రోజు జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో భాగంగా సంబంధిత సమస్యను మంత్రి కందుల దుర్గేష్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థికశాఖ అధికారులను పిలిచి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి దుర్గేష్ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే రెండు మూడు పర్యాయాలు మంత్రి దుర్గేష్ కేబినెట్ దృష్టికి ఇన్‌పుట్ సబ్సిడీ అంశం తీసుకెళ్లగా సీఎం సుముఖత వ్యక్తం చేశారని, వివిధ కారణాల వల్ల ఆర్థిక శాఖలో సంబంధిత ఫైల్ క్లియరెన్స్‌కు జాప్యం జరిగిందన్నారు. అయినప్పటికీ నేడు కలెక్టర్ల సదస్సులో సంబంధిత అంశాన్ని మంత్రి కందుల దుర్గేష్ మరోసారి ఈ అంశం ప్రస్తావించగా సీఎం చంద్రబాబునాయుడు వెంటనేసమస్యకుచెక్ పెట్టారని తెలిపారు. 2024 జులై నెలలో సంభవించిన భారీ వర్షాలు, విపత్తువల్ల నష్టపోయిన రైతాంగానికి ఇప్పటికే ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటన చేశామని మంత్రి కందుల దుర్గేష్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికు కృతజ్ఞతలు తెలియజేశారు.

- తరువాయి 2లో..

## అభాగ్యుల జీవితాల్లో కాంతిరేఖ సీఎం సహాయనిధి

- లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** అభాగ్యుల జీవితాల్లో కాంతిరేఖలా సీఎం సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని కాకినాడ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజలకు మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, మన ముఖ్యమంత్రి చంద్రన్న

- తరువాయి 2లో..

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** గిరిజన ప్రాంతంలో ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. రంపచోడవరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వివిధ రకాల సమస్యలపై 41వినతులు అందుకున్నారు. రంప చోడవరం ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారంకోసం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి నియోజక వర్గం పరిధిలోని పలు ప్రాంతాలు నుండి ప్రజలు వచ్చి వారి

- తరువాయి 2లో..

### ధాన్యం సేకరణకు

# సన్నద్ధం కావాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం సేకరణకు సర్వసన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి లైన్ డిపార్ట్మెంట్ అధికారులను, మిల్లర్లను కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో రబీ సీజన్లో ధాన్యం సేకరణ ప్రక్రియ సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు ప్రయోజనాలే లక్ష్యంగాకార్యాచరణ ఉండాలన్నారు. జిల్లాలో ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని ఆదేవిధంగా రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు పటిష్ట ప్రణాళికతో సన్నద్ధంగా వుండాలని అధికారులను ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణకు సంబంధించి బ్యాంక్ గ్యారంటీలు, రెన్యువల్, బఫర్ గోదాముల వినియోగం, తేమతూనికలపరికరాలు, గోనెసంచులు, రవాణా లేబరు టెక్నికల్ అసిస్టెంట్స్, వీఏఏ జిపిఎస్ కోఆర్డినేట్స్‌తో వాహనాల మూమెంట్ కొరకు కస్టోడియన్ అధికారులుగా సమర్థులను నియమాకం, మిల్లర్ల ఎకనాలెడ్జ్మెంట్, ట్రక్‌సీటు, జనరేషన్ ఎఫ్‌టిఓ జనరేషన్ కాగిత రహిత డిజిటల్ లావాదేవీలు ఇత్యాది అంశాలపై సమీక్షించారు. ఆదేవిధంగా రబీకి కూడా సిద్ధంగా వుండాలన్నారు. జిల్లాలో ఈ-పంట నమోదు ఆధారంగా చూస్తేరబీలో 1,64,854 ఎకరాలలో వరి పంట సాగు చేయడం జరిగిందని, 6,17,000 మెట్రిక్ టన్నుల

- తరువాయి 2లో..


# సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చింతూరు ఐటీడీఏ ముట్టడి, భారీ ర్యాలీ






చింతూరు, మేజర్ న్యూస్ : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం 500 మంది గిరిజనులు మండల కేంద్రం నుండి భారీ ర్యాలీగా కదలి వెళ్లి ఐటిడిఏ కార్యాలయాన్ని ముట్టడించారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గ్రామాల్లో త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని, వలస ఆదివాసీల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పోలవరం ఆర్ అండ్ ఆర్ సమస్యతో పాటుగా పరిహారం పట్ల ప్రభుత్వం త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని, రేషన్ కార్డుల సమస్య పరిష్కరించాలని, కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని, తుని కాకు ప్రోనింగ్ పనులు ఎందుకు చేపట్టలేదో సమాధానం చెప్పాలని, నినాదాలు చేస్తూ కదం తొక్కారు. కార్యాలయానికి చేరుకున్న ప్రజానీకానికి సమాధానం చెప్పేందుకు వచ్చిన ఏపీవోను నిలదీశారు. పత్రికల్లో గత మూడు రోజుల క్రితమే ఐటీడీఏ సమస్యలతో వస్తామని ప్రకటించిన కానీ గ్రీవెన్స్ డే రోజు కూడా పిఓ అందుబాటులో లేకుండా మరో మండలానికి వెళ్లిపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులు అంటే చాలా అలుసుగా చూస్తున్నారని, బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని, అలంకారప్రాయంగా ఉన్న ఐటీడీఏ ప్రజలకు ఎటువంటి సేవలు అందించడం లేదని, తక్షణమే పిఓ వచ్చి తమ సమస్యలకు పరిష్కారం చేసే విధంగా మాట్లాడాలని కార్యాలయం వద్ద బయటాయించారు. అధికారులకు పిఓ తక్షణమే సమాచారం ఇవ్వడంతో గ్రామసభల్లో వేరే మండలంలో ఉన్నందున ఆలస్యం అయిందని సాయంత్రం మూడు గంటలకు వచ్చి ముఖ్య నాయకులతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా స్థానిక వ్యక్తిగత మౌలిక సమస్యలపై పిఓ తో నాయకులు చర్చ జరిపారు. అనంతరం ప్రజల ముందుకు వచ్చి ఐటీడీఏ పీవో అపూర్వ భారత్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పట్ల ఆయా శాఖల వారీగా అధికారులను పంపించి త్వరితగతిన సమస్యలు పరిష్కారం చేస్తామని తెలిపారు. తునికాకు సంబంధించి అటవీశాఖ అధికారులతో మాట్లాడి టెండర్లపై చర్చ జరుపుతామన్నారు. వలస ఆదివాసుల విద్యుత్ సమస్య పట్ల విద్యుత్ అధికారులతో సంప్రదింపులు జరుపుతామన్నారు. త్రాగునీటి సమస్య రెండు వారాల్లో పరిష్కారం చేస్తామని ఏప్రిల్ 15 నాటికి పోలవరం పిడిఎఫ్ ప్రకారం ఒక్కో గ్రామాన్ని తీసుకొని సమస్యను పరిష్కారం చేస్తామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ అధ్యక్షతన జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమీ అమలు కావడం లేదని, గ్రామాల్లో త్రాగునీరు రోడ్లు డ్రైన్లు సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉందన్నారు. మహిళలకు నెలకు 1500 రూపాయలు, 50 సంవత్సరాలు దాటిన వారికి వృద్ధాప్య పింఛన్లు, జల జీవన్ పథకంతో త్రాగునీటి సౌకర్యం వంటివి ఏమి అమలు చేయడం లేదని తెలిపారు. గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ కేవలం దరఖాస్తులు తీసుకోవడంతోనే సరిపెట్టుకుంటున్నారని, సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం పరిహారం పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అధికారుల అవగాహన లోపం కొట్టొచ్చినట్లు కనపడుతుందన్నారు. మరో రెండు నెలల్లో ముంపు మండలాలు వరదల్లో చిక్కుకుంటాయని నిర్వాసితులు ఆందోళన పడుతున్న గాని అవగాహన లేని అధికారులను గ్రామ సభలకు పంపి సమయం వృధా చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు పాలక ప్రభుత్వాలు ప్రజల సమస్యల పట్ల దృష్టి సారించాలని లేకుంటే బాధిత ప్రజానీకంతో దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన దరఖాస్తులను ఏపీఓకు ప్రజలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు సేసం సురేష్ పులి సంతోష్, సోయం చినబాబు, బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య, ఎర్రంశెట్టి శ్రీనివాస్, మల్లం సుబ్బమ్మ, కారం సుందరయ్య, పోడియం లక్ష్మణ్, ఎంపీటీసీ పూనమ్ ప్రదీప్, సర్పంచ్ మారయ్య, బొగ్గా ఎంకమ్మ, మొట్టమ రాజయ్య, పార్వతి, చింత రాంబాబు పాల్గొన్నారు.

## కంపోస్ట్ యార్డుగా డా.బి ఆర్ అంబేద్కర్ పార్క్



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట పట్టణంలోని బ్రౌన్ పేట సెంటర్లో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్కు కంపోస్ట్ యార్డుగా తయారయింది. పార్కులో ఉన్న కమ్యూనిటీ హాల్ వెనక భాగంలో టన్నులకొద్దీ చెత్త పేరుకు పోవడంతో డా.అంభేత్కర్‌కు అవమానం కలుగుతోంది. పార్క్ ని ఆనుకుని వెనకన ఉన్న కాలనీ ప్రజలు, రాత్రి సమయాల్లో పార్కులో గడిపే ప్రజలు వ్యర్థ పదార్థాలను కమ్యూనిటీ హాల్ వెనక భాగంలో ప్రహరీ గోడ వద్ద విచ్చలవిడిగా వేయిస్తుండడంతో డాక్టర్ అంబేద్కర్ పార్కు అపరిశుభ్ర వాతావరణంతో నిండిపోతుంది. అలాగే కమ్యూనిటీ హాలులో ఏదైనా శుభకార్యాలు జరిగినప్పుడు వేసే వ్యర్థాలు పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది. పార్కులో ఉన్న చెత్తను తొలగించేందుకు స్థానికంగా ఉన్న యువత ముందుకు వచ్చి సేవలను అందించేందుకు ప్రయత్నించినా వారి సామర్థ్యానికి మించి టన్నుల కొద్దీ చెత్త పేరుకుని ఉండడంతో దానిని తొలగించేందుకు యువత భయపడి వెనుతిరిగారు. చెత్త కారణంగా విషపురుగులు చేరే అవకాశం ఉన్నందున మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులు పట్టించుకుని, చెత్తను తొలగించి డాక్టర్ అంబేద్కర్ పార్కులో పరిశుభ్ర వాతావరణం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆశీల వేలంపాటలో పాల్గొన్న పాటదారులు



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామ పంచాయతీలో వాహనాల పార్కింగ్ మరియు దుకాణాల ఆశీల పాటకు బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, ఇఓ&పిఆర్డి బి.వి.వి.రమణల ఆధ్వర్యంలో వేలంపాట జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ భార్గవ్ తెలుపుతూ పార్కింగ్ నిమిత్తం ఎల్.రామకృష్ణ రూ.6,60,000/- (మూడు సంవత్సరాల కాలపరిమితికి), దుకాణాల ఆశీలుకు దంటు వీరబాబు రూ.3,97,000/- (మూడు సంవత్సరాల కాలపరిమితికి) వేలం పాటలు కైవసం చేసుకున్నట్లు పంచాయతీ సెక్రటరీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాటదారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధిక లోడు మార్పుపై 50శాతం సబ్సిడీ

**-ట్రాన్స్‌కో ఏఈ రమేష్ కుమార్**



**సామర్లకోట, మేజర్ న్యూస్** : విద్యుత్ లోడును ఎక్కువగా వినియోగించే వినియోగదారులకు ట్రాన్స్ కో లోడు మార్పు పై 50శాతం సబ్సిడీ అందిస్తున్నట్టు ట్రాన్స్ కో ఏఇ ఎం రమేష్ కుమార్ చెప్పారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ వినియోగదారులకు కల్పించిన సౌకర్యాలపై మీడియాకు వివరించారు. విద్యుత్ లోడ్ ను ఎక్కువగా ఉపయోగించే విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం 50శాతం రాయితీతో విద్యుత్ లోడును ఒక కిలో వాట్ నుండి రెండు అంతకన్నా ఎక్కువ వాటేజ్ కు పెంచుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. విద్యుత్తును 1కెవి నుండి 2కెవి, 3కెవి కు అంతకు మించి మార్చుకో దల్చినవారు ప్రభుత్వం ఇచ్చిన 50శాతం సబ్సిడీతో మీ సమీప మీసేవ కేంద్రాలలో రుసుము చెల్లించి, మీ విద్యుత్ లోడ్ ను పెంచుకోవచ్చునని ఈ అవకాశన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఇ రమేష్ కుమార్ తెలిపారు.

# ధాన్యం సేకరణకు సన్నద్ధం కావాలి

మొదటిపేజి తరువాయి

మేర ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశముందని తెలిపారు .రైతుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని మద్దతుధరకుధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అధికారులను అదేశించారు. రబీ ధాన్యం సేకరణకు జిల్లాస్థాయిలో జేసీ చైర్మన్గా ఆర్డీవోలు, పౌరస రఫరాల డీఎం, డీఎస్వో, డిఏవో తదితర అధికారులు సభ్యులుగా కమిటీ ఉందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొనిపనిచేయాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన 404రైతు సేవ కేంద్రాలలోని కొనుగోలు కేంద్రాలలో అమ్మి మద్దతు ధర పొందాలని విస్తృత ప్రచారం గావించాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మిల్లుల సామర్థ్యాలను ముందుగానే తనిఖీద్వారా అంచనా వేయాలన్నారు.రైతు సంతృప్తి ధ్యేయంగా ప్రతి అంశంలో పారదర్శకత నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని లేని పక్షంలో ఐవిఆర్ఎస్ విధానంలో ఫిర్యాదులు ప్రభుత్వానికి వెళతాయని ఆమె సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడినట్లు రుజువైతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లర్లు మంచి గోనె సంచులను రైతులకు సరఫరా చేయాలని సూచించారు. ధాన్యం సేకరణ కార్యాచరణ ప్రణాళికలను సమర్థవంతంగా రూపొందించి ఆచరణకు సిద్ధం కావాలన్నారు. రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి,లక్ష్మీ నారాయణలు ప్రసంగిస్తూ ముందుగానే బాయిల్డ్ రైస్, రా రైస్ లక్ష్యాలను మిల్లర్లకు తెలపాలని, ట్రక్కు సీటు జనరేట్ కాగానే మిల్లర్ల లాగిన్‌కు సమాచారం ముందుగానే వచ్చేస్తుందని తదనుగుణంగా సాంకేతిక సమస్యలు ఉత్పన్నవుతున్నాయన్నారు. గోనె సంచులు మిల్లర్లు సరఫరా చేసినప్పటికీ వాటి చార్జీలు రైతు పేరున జమవుతున్నాయని మిల్లర్ల పేరునే జమ కాబడేలా చర్యలు తీసుకోవాలని, అన్లోడ్ కాకుండానే అన్లోడ్ అయినట్టుగా ఆన్లైన్లో చూపుతోందని, జిపిఎస్ కోఆర్డినేట్స్ తదితర సాఫ్ట్వేర్ సమస్యలను ముందుగానే పరిష్కరించాలని భారత ఆహార సంస్థ, పౌరసరఫరాలశాఖకు ఎంత పరిమాణంలో లక్ష్యాలు నిర్దేశించింది ముందుగా తెలియజేయాలని పాత పెండింగ్ బకాయిలు చెల్లించాలని జాయింట్ కలెక్టర్ వారిని కోరారు.

# అభాగ్యుల జీవితాల్లో కాంతిరేఖ సీఎం సహాయనిధి

మొదటిపేజి తరువాయి

అడిగిన వెంటనే అపన్న హస్తం అందేలా చర్యలు తీసుకుంటున్నారని, వైద్య ఖర్చులు భారమై ఆర్థిక స్థోమత లేని అనేకమంది పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో భరోసానిస్తుందని తెలిపారు. కాకినాడ నియోజకవర్గానికి సంబంధించి 8మంది లబ్ధిదారులకు 6 లక్షల 15 వేల రూపాయలు అందించారని, పేద ప్రజలకు నేనున్నానంటూ చేయూత అందించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గారి పాలన సాగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వ నేతృత్వంలో రాష్ట్రంలోకి దేశ, విదేశీ పెట్టుబడులు వస్తున్నాయని, లక్షలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అరదాఎడి శివ, పిర్ల లక్ష్మీ ప్రసన్న, గురుసు దుర్గారావు, సంఘాని నాగూర్, పిన్నంరెడ్డి బుజ్జి, పట్టా శేఖర్, తిప్పాని విజయ్ పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

మొదటిపేజి తరువాయి

సమస్యలపై ఎమ్మెల్యేకి వినతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మాట్లాడుతూఇకనుంచి ప్రతీ బుధ వారం ప్రజాసమస్యలపై ప్రజాదర్బార్‌కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. నేటి ప్రజాదర్బార్‌లో 41వినతులు రాగా ప్రతీ దరఖాస్తు పరిశీలించి, సమస్యలు పరిష్కారంకోసం సంబంధిత శాఖలు అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపుతామని పేర్కొన్నారు. ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామస్తులు రోడ్డు సౌకర్యం, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, పట్టుచీర గ్రామంలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే రంపచోడవరం మండలం దబ్బవలస గ్రామస్తులు రేషన్ డిపో మంజూరు చేయాలని, విఆర్ పురం గ్రామానికి చెందిన ముత్యాల లక్ష్మి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కావాలని, పెద్ద గెద్దాడ గ్రామస్తులు చెక్ డ్యాం నిర్మాణం ఇలా పలు సమస్యలపై వినతులు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, రంపచోడవరం మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు, మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి, పుట్టి రమేష్, బాపన్న దొర తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం సుగమం





– రావులపాలెం ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే సత్యానందరావు

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం సుగమం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ తక్షణమే ప్రజల సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో ప్రజలకు అనేక సమస్యలు తలెత్తయని దీంతో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని నియోజకవర్గాలలో ప్రజాదర్బార్ కార్యక్రమాలను నిర్వహించి ప్రజల సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. బుధవారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో 75 వినతులు వచ్చినట్లు తెలియజేశారు. భూ సమస్యలు ఉన్నాయని వీటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. తమ పరిధిలో పరిష్కారం కానీ పెద్ద పెద్ద సమస్యలను ఆర్డిఓ, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి భూ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ సత్యానందరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, జక్కంపూడి వెంకటస్వామి, సాధనల శ్రీను, పడాల కొండారెడ్డి మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బూరయ్య మరణం పార్టీకి తీరని లోటు

– ఎమ్మెల్యే సత్యానందరావు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఇటీవల మరణించిన రావులపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పున్నపు సూర్యనారాయణ (బూరయ్య) కు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బూరయ్య పార్టీకి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. బూరయ్య మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. భౌతికంగా ఆయన మరణించినా బూరయ్య చేసిన సేవలు మరువలేనివని ఆయన చేసిన సేవలలో ఆయన బ్రతికే ఉంటారని పేర్కొన్నారు. బురయ్య కుటుంబ సభ్యులకు పార్టీఅండగా ఉంటుందని సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.వి.సత్య నారాయణ రెడ్డి, గుత్తుల పట్టాభి రామారావు, నంధం వీర వెంకట సత్యనారాయణ, జక్కంపూడి వెంకటస్వామి, బులి కొండా రెడ్డి, చిన్నం రామచంద్ర రెడ్డి, అధికారి నాగు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ పాఠశాల ఏర్పాటు కొరకు ఎమ్మెల్యేకు వినతి



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పిచ్చుకలపాడు, ఎటపాక గ్రామ పంచాయితీలలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాల లేకపోవడం వలన దాదాపుగా 500 వందల మంది పిల్లలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భద్రాచలంకి వెళ్ళి చదువుకోవడం వలన ఈ పిల్లలు అందరికీ గత ప్రభుత్వంలో అమ్మ ఒడి రాలేదు అని, ఈసారి కూడా తల్లికి వందనం పథకం వీరికి వర్తించే పరిస్థితి లేదు అని కావున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి, లోకేష్‌కి ఈ సమస్యను తీసుకువెళ్ళి సమస్యకు పరిష్కారం చెయ్యాలని ఎంఎల్ఏ మిరియాల శిరీష భాస్కర్ ని ఎటపాక మండల టీడీపీ నాయకులు బుధవారం కోరడం జరిగింది. చింతూరు మండలం ఏర్రంపేట గ్రామంలో ఉన్న ఏరియా హాస్పటల్‌ను 50 పడకల నుండి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చెయ్యాలని ఎంఎల్ఏ ని కోరడం జరిగింది. చింతూరు మండలం ఎర్రంపేట గ్రామంలో 5 కోట్ల రూపాయలు వ్యయంతో డిగ్రీ కాలేజీ మంజూరు చెయ్యడం జరిగింది కానీ, స్థలం విషయంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుండి అనుమతి ఇప్పించగలరని ఎంఎల్ఏ మిరియాల శిరీష భాస్కర్ ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాటి చలపతి, జిల్లా నాయకులు కిలారీ వెంకన్న, అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డిపాటి ప్రసాద్, ఐ టీడిపి చాంపియన్ బాచినేని శ్రీకాంత్ పాల్గొన్నారు.

### జాంపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది జాంపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచి కార్యాలయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, గొలుగురి వెంకటరెడ్డి, జక్కంపూడి వెంకటస్వామి, సిద్దిరెడ్డి శ్రీను, నందం సత్యనారాయణ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గేట్-2025 పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు

– మరిన్ని ర్యాంకులు సాధించేలా శిక్షణ

– యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) విద్యార్థులు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)–2025 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినవారిని ఉపకులపతి ప్రొ.సిఎస్ ఆర్‌కె.ప్రసాద్ అభినందించినట్లు యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు మాట్లాడుతూ యుసిఇకెలోని విద్యార్థులు గేట్–2025 పరీక్షల్లో జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గేట్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 9వ ర్యాంకు సాధించిన ఈసిఈ విభాగం విద్యార్థి సిహెచ్.సాయి చరణ్‌ను ఉపకులపతి ప్రత్యేకంగా అభినందించారన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఐదుగురు విద్యార్థులు వెయ్యి నుండి 20వేలలోపు ర్యాంకులు, ఈఈఈ విభాగానికి చెందిన 20మంది విద్యార్థులు 11 నుండి 50వేలలోపు ర్యాంకులు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన 9మంది విద్యార్థులు 500 నుండి 10వేలలోపు ర్యాంకులు, ఈసిఈ విభాగానికి చెందిన 28మంది విద్యార్థులు 9 నుండి 50వేలలోపు ర్యాంకులు, సిఎస్ఈ విభాగానికి చెందిన 15మంది విద్యార్థులు 100 నుండి 50వేలలోపు ర్యాంకులు, పెట్రోలియం ఇంజనీరింగ్ మరియు కెమికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన 9మంది విద్యార్థులు 50 నుండి 5వేలలోపు ర్యాంకులు సాధించారన్నారు. మొత్తం 86మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని, రాబోయే కాలంలో పోటీ పరీక్షలలో జెఎన్‌టియుకె విద్యార్థులు మరిన్ని ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు తెలిపారు.

# ఏ.వి.ఎస్.రవి సాయినాథ్‌కి జెఎన్‌టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఏ.వి.ఎస్.రవి సాయినాథ్ సిద్ధాంత వ్యాసం "ప్రీక్లినికల్ స్టడీస్ ఆన్ యాంటీహైపర్‌టెన్సివ్ అండ్ యాంటీడయాబెటిక్ ఎఫెక్ట్ ఆఫ్ సమ్ ఇండీజినస్ మెడిసినల్ ప్లాంట్స్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఫార్మసీ విభాగంలో లభించినది. ఏ.వి.ఎస్.రవి సాయినాథ్ తన సిద్ధాంత వ్యాసాన్ని విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ రిటైర్డ్ ప్రొఫెసర్ డా.పి.రాజేశ్వరరావు మరియు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా.ఏ.ప్రమీలా రాణి ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

# రూ.13 లక్షల ఆర్థిక సహాయంతో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు





- తల్లిదండ్రుల పేరు చిరస్థాయిగా నిలిచే విధంగా సామాజీక సేవా కార్యక్రమం
- రాంజీకి అభినందనలు తెలిపిన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డా.కళ్యాణ్ చక్రవర్తి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** జన్మ ఇచ్చిన తల్లిదండ్రుల పేరు చిరస్థాయిగా నిలిచే విధంగా సామాజీక సేవా కార్యక్రమాన్ని చేపట్టిన వాడకట్టు రామారావు రాంజీ అభినందనీయులు అని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డా. కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు.

కాకినాడ ఎన్.ఎఫ్.సి.ఎల్.రోడ్‌లో గల రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ చారిటబుల్ ట్రస్ట్ భవనంలో గాదె శివరావు, సీతామహాలక్ష్మీ మెమోరియల్ వుమెన్ ఎన్‌పవర్‌మెంట్ సెంటర్లో వాడకట్టు రామారావు రాంజీ రూ.13 లక్షల ఆర్థిక సాయంతో నూతనంగా వాడకట్టు నూకాజీ వెంకటకుమారి దంపతుల పేరిట నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.

కార్యక్రమానికి రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ & ట్రస్ట్ సెక్రటరీ బోడా ఆనంద్ అద్యక్షత వహించగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ డా. కళ్యాణ్ చక్రవర్తి అండాళ్ దంపతులు ముఖ్యఅతిధి గాను వాడకట్టు నూకాజీ వెంకటకుమారి దంపతులు విశిష్ట అతిధులుగాను, పైడా వెంకటేశ్వర రావు పద్మ దంపతులు గౌరవ అతిధులుగా పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ సెంటర్ను వాడకట్టు నూకాజీ వెంకటకుమారి దంపతులు రిబ్బన్ కత్తిరించి ప్రారంబించగా, కంప్యూటర్ళ్ను పైడా వెంకటేశ్వరరావు పద్మ దంపతులు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ సెక్రటరీ దుర్గాప్రసాద్ స్వాగతం పలికారు. క్లబ్ ప్రెసిడెంట్ కృష్ణమోహన్ అద్యక్షత వహించగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డా.కళ్యాణ్ చక్రవర్తి ముఖ్యఅతిధిగాను, వాడకట్టు నూకాజీ, పైడా వెంకటేశ్వరరావు విశిష్ట అతిధిగాను, రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ చారిటబుల్ ట్రస్ట్ బిల్డింగ్ ప్రాజెక్ట్ చైర్మన్ బోడా ఆనంద్, ఎపెక్స్ మూర్తి, వాకచర్ల సూర్యం, జయేష్ దేశాయ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ ఐ.జి. డా. కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లి దండ్రుల పేరు చిరస్థాయిగా నిలిచే విదంగా వారి పేరిట 13 లక్షల రూపాయలతో వుమెన్ ఎన్పవర్మెంట్కు కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసిన వాడకట్టు రామారావు రాంజీ, అభినందనీయులు అన్నారు. బిల్డింగ్ ప్రాజెక్ట్ చైర్మన్ బోడా ఆనంద్ మాట్లాడుతూ రోటరీ మల్టీ పర్పస్ బిల్డింగ్ ద్వారా 5 ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నిర్వహించేందుకు సహయ సహకారాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేసారు. క్లబ్ సభ్యుడు హరిబాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణకు తను అంతగా ఐదు లక్షల రూపాయలు విరాళం అందిస్తున్నట్లు తెలిపారు. పైడా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పైడాస్ చా అభయా ఫౌండేషన్‌కు కంప్యూటల్ ట్రైనింగ్ సెంటర్ నిర్వహణకు ప్రతి నెల 25 వేల రూపాయలు ఇచ్చేందుకు రోటరీ క్లబ్‌తో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం ప్రాజెక్టుకు సహాయ సహకారాలు అందించిన పైడా వెంకటేశ్వరరావు, పద్మ దంపతులు, వాడకట్టు నూకాజీ వెంకటకుమారి దంపతులను రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రరీ సభ్యులు అతిధుల చేతుల మీదుగా శాలువాలు కప్పి పుష్పాగుచ్చాలు అందించి జ్ఞాపికలు బహుకరించి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కాకినాడ పాస్ట్ ప్రెసిడెంట్ సీతాపతిరావు ప్రెసిడెంట్ సెక్రటరీలు పోలిశెట్టి ఈశ్వరరావు, బాబీ, ఎలెక్ట ప్రెసిడెంట్ ఉమా, క్లబ్ సభ్యులు వెంకటలక్ష్మీ, సి.ఎస్.మూర్తి, పలువురు రోటరీ క్లబ్ సభ్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకులు కూరగాయల ధరల స్థిరీకరణకు చర్యలు

**అమలాపురం, మేజర్ న్యూస్ :** ధరల స్థిరీకరణకు చర్యలపై వివిధ శాఖల అధికారులతో డిఎస్ఓ ఎ.ఉదయ భాస్కర్ సమీక్షించారు. నిత్యావసర సరుకులు కూరగాయల ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు గిట్టుబాటు ధరల్లేక ఇబ్బందులు పడకూడదని, ప్రభుత్వం అండగా ఉంటుందన్న భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. కూరగాయలు, ఇతర పంటల ధరల పర్యవేక్షణకు వ్యవసాయ, మార్కెటింగ్, తూనికలు కొలతల శాఖల సహకారంతో రైతులకు మద్దతు ధర దక్కడంతోపాటు వినియోగదారులకు ధరలు అందుబాటులో ఉంచాలన్నారు. ధరల్లో హెచ్చుతగ్గులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎవరికీ ఇబ్బంది లేని రీతిలో సమతుల్యం చేయాలన్నారు. వ్యవసాయ తనిఖీ తోపాటు రియల్ టైం గవర్నెన్స్ అనుసంధానించి పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసు బాబు, డిసిఓ ఎస్.మురళీకృష్ణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాలసరస్వతి, ఏడి మార్కెటింగ్ విశాలాక్షి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ నాగలక్ష్మి, తూనికలు కొలతలు కంట్రోలర్ రాజేష్, రవాణా వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో 'ప్రపంచ గణిత దినోత్సవం'



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక అక్షర పాఠశాలలో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో ప్రపంచ గణిత దినోత్సవం సందర్భంగా డా. అడ్డాల సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యులు మరియు గణితశాస్త్ర ఉపాధ్యాయులు గోపాలకృష్ణని ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల మాట్లాడుతూ గణితశాస్త్రం అంటే చాలా మంది పిల్లలలో భయం ఉంటుందని, ఆ భయాన్ని పోగొట్టి గణితశాస్త్రంపైన ఇష్టం కలిగించేలా భోదన చేస్తున్న అద్భుతమైన ఉపాధ్యాయులు మన గోపాలకృష్ణ మాస్టారు అని అన్నారు. ఆయన శిక్షణలో ఎంతో మంది పిల్లలు గణితశాస్త్రం పైన మక్కువ పెంచుకుని ఈనాడు సమాజంలో ఉన్నతమైన ఇంజనీర్లుగా రాణిస్తున్నారని అన్నారు. విశ్వ గణిత దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి నెలలో ఆఖరి బుధవారం జరుపుకుంటారని, 2025లో ఇది మార్చి 26 న జరుగుతుందని,ఈ దినోత్సవాన్ని 2007లో 3పి లెర్నింగ్ అనే సంస్థ ప్రారంభించిందని, గణితంపై విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించడం, గణితాన్ని సరదాగా నేర్పించడం, అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించడం దీని ప్రధాన ఉద్దేశ్యాలని అన్నారు. భారతదేశానికి గణిత రంగంలో గొప్ప వారసత్వం ఉందని, శ్రీనివాస రామానుజన్, ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, శకుంతలాదేవి వంటి మహానుభావులు ప్రపంచానికి గణితశాస్త్రంలో అమూల్యమైన జ్ఞానాన్ని అందించారని, గణితం అనేది కేవలం గణనలకే పరిమితం కాకుండా, మన జీవనశైలిలో ప్రతిరోజూ ఉపయోగించే శాస్త్రం అని, విశ్వ గణిత దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా దీని ప్రాముఖ్యతను అందరికీ తెలియజేయవచ్చని అన్నారు.

# సిహెచ్.సుమలతకు జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు సిహెచ్.సుమలత సిద్ధాంత వ్యాసం "ఎక్స్‌పెరిమెంట్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ద ట్రైబయోలాజికల్ అండ్ మెకాని కల్ ప్రాపర్టీస్ ఆఫ్ అల్యూమినియం సిలికాన్ కాస్ట్ అలోయ్స్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈమెకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో లభించినది. సిహెచ్.సుమలత తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడ జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. వి.వి.సుబ్బారావు మరియు విజయవాడలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. పి.వి.చంద్రశేఖరరావు ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

# భాస్కర విద్యానికేతన్ స్కూల్‌లో సెమీ రంజాన్ వేడుకలు



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలో గల శ్రీ భాస్కర విద్యానికేతన్ స్కూల్లో సెమీ రంజాన్ వేడుకలు శ్రీ భాస్కర స్కూల్ కరస్పండెంట్ వేణు గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం కరస్పండెంట్ వేణుగోపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లిం అందరూ సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉపవాస దీక్ష చేస్తారని, ఈ ఉపవాస దీక్షలతో మనుషులు యొక్క బలహీనతలు, వ్యసనాలను జయించవచ్చని ఇస్లాం మత గురువులు చెబుతారని, ఉపవాస దీక్షల వల్ల జీర్ణశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని శాస్త్రం చెబుతుందని, ఉపవాస దీక్షలు సహారీతో ప్రారంభమై ఇఫ్తార్‌తో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఐడిబిఐ బ్యాంక్ ఫర్నిచర్ బహూకరణ




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మెర్లపాలెం శివారు వాసంశెట్టి వారి పాలెం ప్రాథమిక పాఠశాలకు రావులపాలెం ఐడిబిఐ బ్యాంకు 60 వేల రూపాయల విలువైన ఫర్నీచర్ ను బహుకరించింది. బుధవారం స్కూల్ కు బెంచీలను మరియు 15 వేల రూపాయల విలువైన ఆర్వో మినరల్స్ ప్లాంట్‌ను బహుకరించారు. సుమారు 75 వేల రూపాయలు విలువ చేసే ఫర్నీచర్ బహుకరించిన రావులపాలెం ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ రమేష్ ను ఆత్రేయపురం ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ ప్రణయ్ ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గూడపాటి మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు ఎస్వీఎస్ రవికుమార్, గ్రామస్తులు వాసంశెట్టి నాగేశ్వరరావు, అర్జున్‌రావు, సదాశివమ్, వెంకటరమణ, ధనలక్ష్మి, కుడిపూడి మోహన్ కృష్ణ, వాసంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి పర్యాటకం ఒక గేమ్ ఛేంజర్



- ఇందులో 20 శాతం వృద్ధిరేటు సాధించాలి
- రాజమండ్రిలో 5 వేల గదులు లభ్యత ఉండేలా హొటళ్ల నిర్మాణం చేపట్టాలి
- పామాయిల్ రంగంలో దేశంలో ఏపీనే నెంబర్ వన్
- ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి
- గోదావరి పుష్కరాలకు సన్నాహక చర్యలు చేపట్టండి
- ప్రత్యేకాధికారులుగా వీరపాండ్యన్, విజయరామరాజు
- అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశం
- జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి 23 నిముషాల పాటు జిల్లా ప్రగతి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక పై ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** రాష్ట్రాభివృద్ధికి పర్యాటక రంగం గేమ్ ఛేంజర్ కాబోతోందని, అన్ని జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాల్లో పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయనగోదావరి జిల్లాలపై కలెక్టర్లు ఇచ్చిన ప్రజంటేషన్‌లపైన స్పందిస్తూ మాట్లాడారు. పర్యాటక రంగంవృద్ధిరేటు పెంపొందించు కోవడానికి గ్రోత్ ఇంజిన్‌లా పనిచేస్తుందని, అధికారులు ఈ రంగంలో ఏపీ అవకాశాలను అందిపుచ్చుకునేలా పనిచేయాలన్నారు. కనీసం ఈ రంగంలో 20 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేకత ఉందని, అక్కడ సుందర ప్రదేశాలు, ఆలయాలు సందర్శించేలా దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేలా జిల్లాలో ప్రణాళికలు రూపొందించి పనిచేయాలన్నారు. పర్యాటకులు రావడమే కాదు, వారికి తగిన సదుపాయాలు కూడా అక్కడ కల్పించాలన్నారు. రాజమండ్రిలో 5వేల గదులు లభ్యత కలిగేలా హొటళ్ల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కేవలం రాజమండ్రి మాత్రమే కాకుండా విశాఖపట్నం, కాకినాడ,తిరుపతి,అమరావతి, అనంతపురంలో ఒక్కో ప్రాంతంలో 5వేల గదులు లభ్యత ఉండేలా హొటళ్ల నిర్మాణానికి కలెక్టర్లు ప్రోత్సాహం అందించాలన్నారు.

**-గోదావరి పుష్కరాలకు సన్నాహాలు...** గోదావరి పుష్కరాలకు సన్నాహక చర్యలు మొదలు పెట్టాలని సీఎం అధికారులకు ఆదేశించారు. దీనికోసం వెంటనే ఇద్దరు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నామన్నారు. ఐఏస్ అధికారులు వీరపాండ్యన్‌ను ప్రత్యేకాధికారిగా, విజయరామ రాజును అధనపు అధికారిగా నియమిస్తున్న సీఎం తెలిపారు.

**-పామాయిల్ సాగులో ప్రగతి సాధించాలి...** దేశంలో పామాయిల్ సాగులో మన రాష్ట్రం దేశంలోనే నెంబర్ ఒన్‌గా ఉందన్నారు. దేశంలో 60 శాతం పామాయిల్ సాగు మన రాష్ట్రంలోనే జరుగుతోందన్నారు. మరింత ఎక్కువగా రైతులు పామాయిల్ సాగువైపు ప్రోత్సహించాలన్నారు. జాతీయ రహదారుల వెంబడి కూడా ఖాళీ స్థలల్లో పామాయిల్ చెట్లుపెంచేఅవకాశాలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో పరిశీలించాలన్నారు.తద్వారా రహదారులవెంబడి పచ్చదనం పెంచడమే కాకుండా రహదారులు శోభాయమానంగా కనిపిస్తాయన్నారు.

**-కడియం నర్సరీలో నరేగా పనులు...**కడియం నర్సరీలో నరేగా పథకం కింద పనులు చేయాలని దీనికి సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. ఆక్వారంగం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆక్వా వ్యర్థాలు వృథాగా పోకుండా వాటి ద్వారా ప్రొటీన్ ఉత్పత్తులు తయారచేసే పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు.

**-డెల్టాలో మూడు పంటలు...**కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో రైతులు మూడు పంటలు సాగు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దానికున్న సాధ్యసాధ్యాలను అంచనా వేసి రైతులు మూడు పంటలు పండించేలా ప్రోత్సహించాలన్నారు. వరి తర్వాత రెండు డ్రై క్రాప్స్ పండిచడానికి వీలు కల్పించాలన్నారు.

**-గోదావరి జిల్లాలు పురోగమించాలి...**గోదావరి జిల్లాలు పురోగమిస్తూ ప్రగతిపథంలో ముందుకెళ్లాలని, ఆ దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కోనసీమ జిల్లా తలసరి ఆదాయం తక్కువగా ఉందని కారణాలు ఏంటీ అనేది అధికారులు విశ్లేషించుకోవాలన్నారు. కోనసీమ జిల్లాలు పురోగతిలో ముందుండేవి ఇప్పుడు కాస్తంత వెనుకబడుతున్నాయని, ఇది మంచిది కాదని ఈ జిల్లాల అధికారులు వెంటనే దీనిపై దృష్టి సారించాలన్నారు. మెట్ట ప్రాంతమైన ఏలూరు తలసరి ఆదాయంలో ముందుంటే సారవంతమైన భూములున్న కోనసీమ జిల్లా వెనుకబడిపోవడం సరికాదని దీనిపైన అధికారులు కృషి చేయాలన్నారు. తమ తమ జిల్లాల్లో వృద్ధి రేటు పెంపొందించుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఆర్వోబీ పరిపాలన అనుమతులు మంజూరు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** పిఠాపురంలో రూ. 59.70 కోట్లతో ఆర్వోబీ పరిపాలన అనుమతులు ప్రభుత్వం మంజూరు చేసిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని సామర్లకోట–ఉప్పాడ రోడ్డులో రైల్వే క్రాసింగ్ వద్ద వంతెన (ఆర్వోబీ) నిర్మాణాని కి రూ. 59.70 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపారు. పిఠాపురంలో ఈ ఆర్వోబీ నిర్మాణానికి గత ఎన్నికల సమయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని, అందులో భాగంగా మంగళవారం పరిపాలన అనుమతి ఇస్తూ జిఓ జారిచేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. తొలుత వంతెన నిర్మాణ వ్యయం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని అనంతరం దాన్ని కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి (సీఆర్ఎఫ్) కింద కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్మెంట్ చేస్తుందని ఆయన తెలిపారు.

# స్కిల్ డెవలప్మెంట్ పై శిక్షణతో యువతకు ఉపాధి

– ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన యువతీ యువకులకు స్కిల్ డెవలప్మెంట్ పై శిక్షణ అవసరమేనని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. రంపచోడవరంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ బుధవారం ప్రారంభించారు. రంపచోడవరంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఆధ్వర్యంలో అంబూజా ఫౌండేషన్ స్కిల్ డెవలప్మెంట్ వారి సారధ్యంలో గ్రామీణ ప్రజలకు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని సంకల్పంతో రంపచోడవరంలో ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించడం జరిగింది. ఈసందర్భంగా శాసనసభ్యురాలు శిరీష దేవి మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో ఇలాంటి స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న నిరుద్యోగ యువత అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఇక్కడ ఇస్తున్న స్కిల్స్ టైలరింగ్, కంప్యూటర్ కోర్సులు, ఏసీ రిఫ్రిజిరేటర్స్ మరమ్మతులు పై యువత స్కిల్స్ తో కూడిన శిక్షణ పొందితే రాజమండ్రి, విశాఖపట్నం వంటి పట్టణాలకు వెళ్ళనవసరం లేకుండా ఈ ప్రాంతంలోనే స్వయం ఉపాధి అవకాశాలు పొందడానికి వీలు కలుగుతుందని అన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా మీరే ఆస్కిల్‌ని ఉపయోగించుకొని సెల్ఫ్ ఎంప్లాయి మెంట్ పొందవచ్చని, మీకు ఎలాంటి సపోర్ట్ కావాలన్నా మేము ఇస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు, ఈ కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి మేనేజర్ మురళీమోహన్, అంబుజా ఫౌండేషన్ స్కిల్ డెవలప్మెంట్ సంస్థ జోనల్ మేనేజర్ మిథున్ కుమార్, సెంటర్ మేనేజర్ శ్రీకాంత్, ప్లేస్మెంట్ ఆఫీసర్ తులసిరామ్, ఎంఐఎస్ దుర్గ, ఐటీ ఫ్యాకల్టీ సుధీర్, కుట్టుమిషన్ ఫ్యాకల్టీ సురేఖ, మొబలైజర్ వీర నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురం పంచాయతీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం



ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలో సమస్యలు పరిష్కరించాలని బుధవారం రంపచోడవరంలో ఏర్పాటు చేసినటువంటి ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎటపాక మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు, ఎస్టీ సెల్ నాయకులు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా కనితి మధు మాట్లాడుతూ కృష్ణవరం పంచాయతీ కొత్తూరు గ్రామంలో అలుగు వాగు ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువ తీస్తే సుమారు 1000 ఎకరాలు నీరు అందుతుందని, కన్నాపురం, రంగాపురం, పట్టుచీర, లక్ష్మీపురం, బూరువాయి రైతులు ఈ కాలువ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, ఎడమ కాలువ తీసి రైతులను ఆదుకోవాలని అయన కోరారు. లక్ష్మీపురం పట్టుచీర గ్రామంలో అంగనవాడి నూతన బిల్లింగ్ నిర్మించాలని అలాగే మద్దిమడుగు పట్టుచీర గ్రామాలలో కరెంటు సమస్య తీర్చాలని కణితి మధు తెలియజేశారు. ఈ సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉండేటి వెంకన్న, ఉండేటి రమేష్, లక్ష్మీపురం పంచాయతీ మాజీ సర్పంచ్ పెనుబల్లి సీతయ్య, తెల్లం సత్యం, ముర్రం నాగరాజు, బాలరాజు, బోడ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా జోన్ పై గ్రామసభ



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** రొయ్యల చెరువు వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జిల్లా కలక్టర్ ఆదేశాల మేరకు వెలిచేరు, తాడిపూడి, ఉచ్చిలి, వద్దిపర్రు గ్రామలలో బుధవారం ఆక్వా జోన్ గ్రామ సభ నిర్వహించారు. ఆక్వా సాగు వలన రైతులకు కలుగు ఇబ్బందుల గురించి చర్చించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆక్వా జోన్ సంబంధిత సమస్యలను పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ భాను, సర్పంచులు జుజవరపు శ్యామల హరిబాబు, వేముల శ్రీనివాస్, వీఆర్వో సుబ్బిరెడ్డి, మత్స్యశాఖ అధికారి డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## గరుడ వాహనంపై విహరించిన స్వామివారు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అధ్యయనోత్సవాలు రెండవ రోజు బుధవారం రెండో రోజు మేలుకొలుపు, ద్రవిడ వేద పారాయణం, తీర్థగోష్ఠి, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ అష్టోత్తర శతనామావళి, కల్యాణం, నివేదన, స్వామివారి పల్లకీ సేవ, గరుడ వాహన సేవ తదితర కార్యక్రమాలను పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కేరళ కళాకారులు నిర్వహించిన వాయిద్యం అందరినీ అలరించింది. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# 'కార్యకర్తే అధినేత' తెలుగుదేశం పార్టీ నినాదం





**– ఆ మాటను ఆచరణలో పెట్టేందుకు సత్వర కృషి**
**– కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గంలో ప్రతి బుధవారం కార్యకర్తలతో సమావేశం : ఎమ్మెల్యే సత్యానందరావు**

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** కార్యకర్తే అధినేత అనేది తెలుగుదేశం పార్టీ నినాదం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డిలతో కలిసి పార్టీ కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఇచ్చిన మాట మేరకు కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని ఆచరణలో పెట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి బుధవారం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఈ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు గుర్తుచేశారు. కార్యకర్తే అధినేత అనే మాటలను తెలుగుదేశం పార్టీ ఆచరణలో పెడుతోందని ఇకపై ప్రతి కార్యకర్తను కలిసి సమస్యలు పరిష్కరించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ సంచలన నిర్ణయం తీసుకున్నార న్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమని దేశంలో ఏ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తెలుగుదేశానికి ఉందని అన్నారు. ఇటీవల కోటి సభ్యత్వాలతో చరిత్ర సృష్టించి అతిపెద్ద కుటుంబంగా మారిన నేపథ్యంలో కార్యకర్తే అధినేత అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారని ఈ మేరకు అన్ని నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారికి అండగా నిలుస్తామని సమస్యలు పరిష్కరించాలని పార్టీ నాయకులు, శ్రేణులకు ఆదేశాలు జారీ చేశారని వివరించారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జ్ లతో పాటు బాబు ష్యూరిటీ–భవిష్యత్ కు గ్యారెంటీ ఫీల్డ్ వర్క్, శంఖారావం ఫీల్డ్ వర్క్, ఓటర్ వెరిఫికేషన్, పార్టీ యాప్స్, సభ్యత్వ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలను మరోసారి అభినందించారు. పార్జీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం అన్ని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్యేలు ప్రతి బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తామని తెలిపారు. మధ్యాహ్నం నుంచి నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రతీ కార్యకర్తను అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయండి -సిపిఎం డిమాండ్




**కూనవరం,మేజర్‌న్యూస్ :** కూనవరం విఆర్ పురం చింతూరు మండలాలకు చెందిన పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని చింతూర్ ఐటిఐ కార్యాలయాన్ని ముట్టడించిన సిపిఎం శ్రేణులు ఆర్అండ్ఆర్ పిడిఎఫ్‌లో నిర్వాసితులను తొలగించడం పట్ల తీవ్ర ఆందోళనలో ఈప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

అనేక మంది యువతీ యువకులకు స్థానికులకు ఆర్అండ్ఆర్ పిడిఎఫ్‌లో పేరు లేకపోవడంతో వారందరిని చింతూరు ఐటిఐ కార్యాలయానికి తరలించి ధర్నా నిర్వహించారు పోలవరం నిర్వాసితులకు అన్యాయం జరిగితే ఉపేక్షించేది లేదని సిపిఎం నాయకులు జిల్లా కార్యదర్శి బొప్పన ఆగ్రహం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో కూనవరం విఆర్‌పురం చింతూరు మండలాలకు చెందిన నిర్వాసితులు పాల్గొన్నారు.

# కాకినాడ నగరంలో సమస్యలు పరిష్కరించాలి

– నగర పాలక సంస్థ కమిషనర్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా
– దోమల నివారణ, డ్రైన్స్ క్లీనింగ్ తక్షణమే చేపట్టాలని డిమాండ్
– సమస్యలపై అదనపు కమిషనర్‌కు వినతి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ నగరంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఉదయం నగర పాలక సంస్థ కమిషనర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి అనంతరం అదనపు కమిషనర్ సుధాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలలో భాగంగా కాకినాడ నగరంలో మార్చి 11 నుండి 20 వరకు వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలు సిపిఎం దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను అధికారులకు తెలియచేయడం జరుగుతుందన్నారు. పెన్షనర్స్ ప్యారడైజ్ గా పేరుగాంచిన కాకినాడ దోమల నిలయంగా మారిపోతుందన్నారు. చెత్త సేకరణ కు ఇచ్చిన ప్రాధాన్యత డ్రైన్ క్లీనింగ్ కి లేకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నట్లు చెప్పారన్నారు. నగరంలో సామాన్యుల సొంతింటి కల నెరవేర్చాలని, టిడ్కో గృహాలు నిర్మాణం పూర్తి చేయాలని, స్థలం ఉన్నవారికి హౌసింగ్ లోన్ మంజూరు చేయాలన్నారు. నగరంలో వేసవిలో త్రాగునీటి కొరత లేకుండా చూడాలని, శివారు ప్రాంతాల్లో పరిశుభ్రమైన నీరు అందించాలన్నారు. నగరంలో అవసరమైనచోట మున్సిపల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, సిసి కేమెరాలు ఏర్పాటు చేయాలని, జిజిహెచ్ పడకల స్థాయి పెంచాలన్నారు.

జగన్నాథపురం ఉప్పుటేరుపై 3వ వంతెన నిర్మించాలని, నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలన్నారు. నగరపాలక సంస్థ అధికారులు సాయంత్రం వేళల్లోపేటల్లో పర్యటించాలని కోరుతున్నా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు కాకినాడ నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించి ప్రజా పాలన కొనసాగించాలన్నారు. సిపిఎం దృష్టికి వచ్చిన వివిధ ప్రాంతాల సమస్యలను రాతపూర్వకంగా అదనపు కమిషనర్ కు సమర్పించగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగరకమిటీ సభ్యులు మలక వెంకట, నాగా బత్తుల సూర్యనారాయణ, ప్రసాద్‌లతో పాటు మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ళపద్మ, వెంకట్రావు, కె.సత్తిబాబు, భూలక్ష్మి, భారతి, సత్యానందం, సుధాకర్, సత్యనారాయణ, సురేష్, విజయ్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# బి.శ్రీదేవికి జెఎన్టీయుకె పిహెచ్‌డి




కాకినాడ, మేజర్ న్యూస్ : నిపుణుల బృందం సిఫార్సు మేరకు బి.శ్రీదేవి సిద్ధాంత వ్యాసం "ఎన్‌హాన్సింగ్ ఆటోమేటెడ్ షార్ట్ ఆన్సర్ గ్రేడింగ్ త్రూ టెక్స్ట్ అగ్మెనెంటేషన్ అండ్ డొమైన్ అడాప్టేషన్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈమెకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగంలో లభించినది. బి.శ్రీదేవి తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె ఐక్యూఏసి డైరెక్టర్ & సిఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డా.ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్ మరియు సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ సిఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డా.ఎస్.రమాశ్రీ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

# ఆదిత్య యూనివర్సిటీ సి.ఎస్.ఇ విభాగంలో ప్రాజెక్ట్ ఎక్స్-పో



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బి.టెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు 'ప్రాజెక్ట్ ఎక్స్పో 2025' ఘనంగా జరిగింది. ప్రాజెక్ట్ ఎక్స్పో ను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ డిప్యూటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్పోలో విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సృజనాత్మక పరిష్కారాలను ప్రతిపాదించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం బి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్–అకాడెమిక్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్, సంబంధిత విభాగాధిపతి డాక్టర్ కోర్ల స్వరూప, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. రవి కిషోర్, డాక్టర్ డి. చంద్రశేఖర్, డాక్టర్ వి.వైతీశ్వరన్ పాల్గొన్నారు.

# నమ్మించి మోసం చేశాడంటూ న్యాయపోరాటం చేస్తున్న మహిళ..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం తనను నమ్మించి మోసం చేశాడంటూ న్యాయం జరిగేలా చూడాలని సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీకి తన గోడు వెలబుచ్చింది. ఈ సందర్భగా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితురాలు అందించిన వివరాలు ప్రకారం యర్రవరం గ్రామానికి చెందిన గురిమెరికల వీర వెంకటలక్ష్మి ఏలేశ్వరం పట్టణానికి చెందిన కోన శ్రీనివాస్‌తో గతకొన్ని సంవత్సరా లుగా కలిసి ఉంటున్నామని, ఆమెను వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆవేదన చెందింది. తమ కుటుంబ సభ్యుల శుభకార్యాలకు పలు అవసరాలకు నా తాలూకా సొమ్మును తీసుకుని ఇప్పుడు నేనెవరో తెలియనట్టు నటిస్తున్నాడని కన్నీరు పెట్టుకుంది. సుమారు 8 లక్షల వరకు నా వద్ద నుంచి తీసుకొన్నారని, అదేగాక కొంత బంగారం వెండి కూడా అతని వద్ద ఉందని బాధితుంాలు మీడియా ముఖంగా తెలిపింది. నేను ఒంటరిదాన్ని అందుకనే సిపిఐ ఎంఎల్ సిపిఐఎంఎల్ వినోద్ మిశ్రా మహిళా సంఘాల్ని ఆశ్రయించానని తెలిపింది. ఈ సందర్భంగా సిపిఐ ఎం ఎల్ వినోద్ మిశ్రా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొసిరెడ్డి గణేష్, మహిళా సంఘ నేత గండేటి నాగమణి మాట్లాడుతూ బాధితురాలికి మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమెకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. బాధిత మహిళకు న్యాయం జరగని ఎడల ఉద్యమం చేపడతామని ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు.